• నగరంలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం, పార్టీ శ్రేణులు



# నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్రంలో పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది
- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- నగరంలో నిర్వహించిన రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఎంపీ ఎన్నికల్లో నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పదేళ్లు ఉంటుంది. నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీని తీసుకువస్తాను. ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తా..' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నిజామాబాద్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. 'శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ నగరంలో పార్టీ తరఫున నిలబడ్డ షబ్బీర్ అలీ గెలిపిస్తారని అనుకున్నాం. ఆయన గెలిస్తే మంత్రి అయ్యేవారు. నగరం మరింత అభివృద్ధి చెందేదని సీఎం అన్నారు. బీజేపీని గెలిపించడం వల్ల ఉపయోగం లేదు. పదేళ్లలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వల్ల అభివృద్ధి జరగలేదు' అని అన్నారు. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. పదేళ్ల ప్రభుత్వం ఉంటుందని ఇక్కడి యువకులకు, అన్ని వర్గాలకు కావాల్సిన అభివృద్ధి పనులను చేస్తామన్నారు. బీడీ కార్మికులకు అండగా ఉండటంతో పాటు గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారు. యువతకు అండగా ఉండటంతో పాటు ఇప్పటికే 30వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. నిజామాబాద్‌కు రింగ్‌రోడ్ తీసుకురావడంతో పాటు ఇతర నగరాల్లాగానే మరింత అభివృద్ధి జరిగే విధంగా చూస్తామని సీఎం ప్రకటించారు. ఈ సమావేశానికి వచ్చిన యువకులతో పాటు జిల్లా యువకులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ అభ్యర్థిని ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దొంగ వాగ్దానాలు చేసి ఎంపీగా గెలిచిన ఐదేళ్లలో ఎలాంటి పనులు చేయలేదని విమర్శించారు. ఏ ఒక్కరోజు కూడా జిల్లాకు అండగా నిలవలేదన్నారు. నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో చక్కెర ఫ్యాక్టరీని తెరిపించేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సీఎం కోరారు. ఈ కార్నర్ మీటింగ్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు మాట్లాడారు.

### సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్ సక్సెస్..

నిజామాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి నగరంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ సక్సెస్ అయింది. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా జనసమీకరణ చేయడంతో గోల్‌హనుమాన్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ సుమారు 15 నిమిషాల పాటు సాగింది. గోల్ హనుమాన్ చౌరస్తా నుంచి ఆర్యసమాజ్, పెద్దబజార్ మీదుగా నెహ్రూపార్క్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగానికి సైతం కార్యకర్తలు కేరింతలు కొట్టారు. వారిని ఉత్సాహపరిచేందుకు 'మూడు రంగుల జెండా పట్టి సింగమోలే కదిలీనాడు' అనే పాటను రేవంత్‌రెడ్డి ప్రసంగానికి ముందు వేయడంతో కార్యకర్తలు నృత్యాలు చేశారు. కార్నర్ మీటింగ్‌కు వేలాది సంఖ్యలో జనం, పార్టీ శ్రేణులు తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. రోడ్‌షోలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, మాజీ మేయర్ సంజయ్, రత్నాకర్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

### • సీఎం రోడ్‌షో సైడ్‌లైట్స్

- రాత్రి 8.20 గంటలకు సీఎం నగరానికి రాక
- రాత్రి 8.26 గంటలకు గోల్‌హనుమాన్‌కు..
- రాత్రి 8.28 గంటలకు రోడ్‌షో ప్రారంభం
- రాత్రి 8.50 గంటలకు నెహ్రూపార్క్‌కు రోడ్‌షో
- రాత్రి 9.15 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభం.. 9.40 గంటలకు ముగింపు
- రాత్రి 9.42 గంటలకు సీఎం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం



• నగరంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, తదితరులు



• ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

• ఆర్మూర్ రోడ్‌షోలో సీఎం..

# ఆర్మూర్ రైతులను మర్చిపోలేను..

- పసుపు బోర్డు కోసం దీక్షలో పాల్గొన్నా
- పీసీసీ అధ్యక్షుడిగా నియామకమయ్యా
- రాష్ట్రమంతా తిరిగి రైతులు, ప్రజల అండతో సీఎం అయ్యా
- ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని లక్ష మెజార్టీతో ఎంపీగా గెలిపించాలి
- ఆర్మూర్ రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి



ఆర్మూర్ రోడ్‌షోలో ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం

నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఆర్మూర్ రైతులను నేను మర్చిపోలేను.. పసుపు బోర్డు కోసం ఇక్కడి రైతులు దీక్ష చేసినప్పుడు వచ్చాను.. రైతుల సహకారంతో పీసీసీ అధ్యక్షుడిని అయ్యాను.. రాష్ట్రమంతా తిరిగి ప్రజల అండతో ముఖ్యమంత్రిని అయ్యాను' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లో బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. మీరు ఆదరించడంతో శాసనసభ ఎన్నికల్లో 65 సీట్లను గెలుచుకొని ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువచ్చామని అన్నారు. తనకు అండగా ఉన్న జిల్లా రైతులు ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు వంద రోజుల్లో తీసుకువస్తానన్న కవితను గెలిపించి పంపించారని, వంద రోజులేమో కానీ ఫ్యాక్టరీ మూతపడిందని అన్నారు. అదే రీతిలో 2019 ఎన్నికల్లో ఆమెను ఓడించి ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకువస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్‌ను గెలిపించారని, ఇద్దరు ఇక్కడి రైతులను మోసం చేశారని ఆరోపించారు. శాసనసభ ఎన్నికల్లో కూడా నకిలీ జీవన్‌రెడ్డిని ఓడించారని, విదేశాల్లో వ్యాపారాలు నిర్వహించే బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. ఆయన వల్ల ఈ ఐదు నెలల్లో ఏమైనా ఉపయోగం జరిగిందా అని సీఎం ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో స్వయంగా రైతు అయిన జీవన్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ రోడ్‌షోలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



సాలూర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



# హై అలర్ట్

- ఎన్నికల నేపథ్యంలో నిఘా
- ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- జిల్లాలో పలు చోట్ల కేంద్ర బలగాల మోహరింపు
- డబ్బు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
- ఎన్నికలు ముగిసే వరకూ తనిఖీలు

బోధన్‌రూరల్, మే 8: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో పోలీసులు అంతర్రాష్ట్ర సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు, ఇతర సామగ్రి తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సాలూర అంతర్రాష్ట్ర సరిహద్దులో పోలీసులు నిఘాను పటిష్ఠం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఆ యా ప్రాంతాలకు నగదుతో పాటు మద్యం, ఇతర సామగ్రి తరలిస్తారన్న అనుమానాలు వ్యక్తమవడంతో సరిహద్దులో వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీంతో సాలూర అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం హై అలర్ట్‌గా మారింది.

### బోధన్ నలుమూలాల్లో చెక్‌పోస్టులు

బోధన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుతో పాటు ఖండ్‌గావ్ చెక్‌పోస్టు, కందకుర్తి, నవీపేట యంచ, పోతంగల్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలాంటి మద్యం, డబ్బులు అక్రమంగా తరలించకుండా సిబ్బంది 24గంటలు విధులు నిర్వర్తిస్తున్నారు.

### వాహనాల తనిఖీలకు ప్రత్యేక బృందాలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులతో పాటు నగదు తరలిస్తున్నట్లు అనుమానం ఉన్న వాహనాల తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ నిఘా బృందాలు విస్తృతంగా తనిఖీ చేపడుతున్నారు. పలు చోట్ల కేంద్ర బలగాలు మోహరించాయి. అన్ని రాజకీయ పార్టీలు నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల ప్రాంతాల నుంచి మద్యం, డబ్బులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వస్తువులు సరఫరా కాకుండా నిఘా పెంచారు. బోధన్ డివిజన్ పరిధిలో వాహనాల తనిఖీల కోసం ఎనిమిది టీమ్‌లు పని చేస్తున్నాయి. పలు రాష్ట్రాలు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు బోధన్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు నుండే రావాల్సి ఉంటుంది. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాల పత్రాలను సైతం పరిశీలిస్తున్నారు.



బోధన్‌లో అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

### రూ. 50వేలు మించితే

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల్లో రూ.50 వేలకు పైగా ఉంటే వాటికి సంబంధించిన పూర్తి వివరాలు తనిఖీ బృందాలకు తెలియజేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కూడా అధికారులకు చూపించాల్సి ఉంటుంది. 10లక్షల వరకు నగదు దొరికితే తనిఖీ బృందాలు ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం అందిస్తారు. వేసవి సెలవుల సందర్భంగా ప్రజలు జిల్లాలకు వెళ్లి వస్తున్న వాహనాలను తనిఖీలు చేపట్టి వారి వివరాలు సేకరిస్తున్నారు. వాహనాల్లో ఉన్న బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. 24 గంటల పాటు తనిఖీ బృందాలు అన్ని చెక్‌పోస్టులలో అప్రమత్తంగా పని చేస్తున్నాయి.





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

# ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సిమీ మద్దతు

• బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

పెద్దబజార్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతూ నిషేధిత సిమీ సంస్థ కరపత్రాలను పంచుతోందని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకప్పుడు సిమీ కార్యకలాపాలు కొనసాగాయని.. దాన్ని నిషేధించిన తర్వాత ఉనికి లేకుండా పోయిందన్నారు. ఈ సంస్థ తర్వాత పీఎఫ్ఐ కార్యకలాపాలు వెలుగు చూడడంతో.. ఎన్ఐఏ విచారణ జరుపుతోందన్నారు. 1973లో సిమీ సంస్థ ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్ యూనివర్సిటీలో ఏర్పాటైందన్నారు. దేశంలో 17 చోట్ల బాంబు పేలుళ్లు, నిషేధిత కార్యకలాపాల చట్టం కింద కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. దీంతో సిమీ కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో గెలవడానికి ఏకంగా ఇలాంటి సంస్థ మద్దతును తీసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో గతంలో ఐఎస్ఐ కార్యకలాపాలు కూడా కొనసాగేవన్నారు. బోధన్‌లో రోహింగ్యాలకు పాస్‌పోర్టులు ఇచ్చారన్నారు. గల్ఫ్ దేశాల్లోని కొన్ని మతసంస్థలు కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పాలన పగ్గాలు తీవ్రవాద సంస్థల చేతుల్లోకి వెళ్తాయని తెలిపారు. జిల్లాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై స్పష్టత ఇవ్వాలని అర్వింద్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు కులాచారి దినేష్, న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, గడ్డెభూమన్న, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ ద్వారానే రైతులకు మేలు ..

వేల్పూర్: నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని, వారు పండించే పంటలకు ధర కల్పించడానికి చట్టాలను రూపొందించడం జరుగుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో ఛాయ్‌పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. మోదీ అవినీతి లేని పాలనలో రైతుల పంటలకు మద్దతు ధరలు వస్తాయని అర్వింద్ అన్నారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు మల్కన్నగారి మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



• దూదిగాంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

# అబద్ధాలలో రేవంత్‌రెడ్డి నెంబర్‌వన్

• బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మెండోర, మే8: హామీలు నెరవేర్చకుండా తేదీలు చెబుతూ అబద్ధాలు ఆడడంలో ప్రపంచంలోనే ఎవరైనా ఉన్నారంటే అది సీఎం రేవంత్‌రెడ్డి అని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని దూదిగాంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు హామీలతో అధికారంలోకి వచ్చి వంద రోజుల్లో హామీలు నెరవేర్చకుండా దేవుళ్ల మీద ఓట్లు వేస్తూ తేదీలు చెప్పుతూ మళ్లీ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ ఎప్పుడైనా గ్రామాల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరించాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, జడ్పీటీసీ తలారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు..

ఏర్గట్ల: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని, వారిచ్చిన హామీలు అమలు కాలేదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక ఉచిత బస్సు తప్ప మిగతావేవి అమలు కాలేదన్నారు. బాజిరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రశ్నించే గొంతుకవుతానని, కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాముడు వేరు.. రాజకీయం వేరు

ముప్కాల్: రాముడు వేరు.. రాజకీయం వేరని రాముడితో రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం రాత్రి బాల్కొండ మండల కేంద్రంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, ఎంపీపీ, జడ్పీటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ప్రేరణ పోటీలకు జిల్లా విద్యార్థులు



దీక్షిత్ భవాని

నిజామాబాద్‌అర్బన్, మే 8: జూన్ 1 నుంచి 10 వరకు పది రోజుల పాటు జాతీయ అంతర్జాతీయ స్థాయి శిక్షకులచే గుజరాత్‌లోని హైమదాబాద్‌లో నిర్వహించే ఎక్స్‌పరిమెంటల్ లర్నింగ్ ప్రోగ్రాంకు జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. గుజరాత్‌లోని మోహాసానా జిల్లాలోని తన స్వస్థలమైన వాద్ నగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మొదటి పాఠశాలను ప్రేరణపేరుతో మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నందున దేశంలోని యువతకు మార్పుకు ఉత్ప్రేరకాలుగా మార్చేందుకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వ్యాసం/కవిత/కథ/పాటలు రాయడం, డ్రాయింగ్ మొదలైన వివిధ కార్యక్రమాలలో భాగంగా ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 10న జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి జాతీయ స్థాయికి వర్ని మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్‌లో 10వ తరగతిలో చదువుతున్న శ్రీదీక్షిత్, జెడ్పీహెచ్‌ఎస్ బినోల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భవానిలు ఎంపికైనట్లు డీఈవో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## మోపాల్‌లో చెక్‌పోస్టుల పరిశీలన



తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

మోపాల్, మే 8:పార్లమెంట్ ఎన్నికలు ఎలాంటి ప్రలోభాలు జరగకుండా నివారించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకులు డీఎం నెమ్మి మాధవనగర్ చెక్‌పోస్టును బుధవారం పరిశీలించారు. నిఘా బృందాల పనితీరును పరిశీలించారు. పోలింగ్‌కు సమయం సమీపించడంతో తనిఖీలను నిరంతరం చేపట్టాలని ఆయన కోరారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎంత నగదు వసూలు, మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారో వివరాలను రికార్డుల ద్వారా పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని కోరారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఇతర అధికారులు ఉన్నారు.

## టీటీసీ సెంటర్‌ను పరిశీలించిన డీఈవో



టీటీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, మే 8:నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రారంభమైన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణ శిబిరాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో మాట్లాడారు. వారి సమస్యలను, కోర్సు జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. కోర్సును క్రమశిక్షణతో పూర్తి చేయాలని రెగ్యూలర్‌గా హాజరుకావాలని ఆయన సూచించారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న తహసీల్దార్

ధర్పల్లి, మే 8: మండలంలో ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ మాలతీ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. మండలంలో 35 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిలో విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్ సౌకర్యాలు సిద్ధం చేశామన్నారు. 27 మంది హోం ఓటర్లను గుర్తించామని వారిచే ప్రత్యేక ఎన్నికల సిబ్బంది ఓటు వేసే ప్రక్రియ పూర్తి చేశారన్నారు. మండలంలో 31,655 మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా గ్రామస్థాయిలో కార్యదర్శులు స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు తగినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలింగ్ స్టేషన్లలో ఇప్పటికే అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేసిఎన్నికలకు సిద్ధంచేశామన్నా రు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సిబ్బంది ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించవద్దని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవి, ఏఆర్‌ఐ రవి, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల కేంద్రాల పరిశీలన

మోస్రా,మే8: మండల కేంద్రంతో పాటు చే నెంబర్ తండా, గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాల్లోని ఎన్నికల కేంద్రాలను సెక్టార్ ఆఫీసర్ డీ.నాగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ లెవల్ అధికారులతో మాట్లాడుతూ ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్ కైలాష్, బీఎల్‌వోలు కాశీరాం, సుమలత, రాము, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి.. అండగా ఉండి అభివృద్ధి చేస్తా

**● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి**

ఆర్మూర్‌రూరల్, మే8: రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను గెలిపిస్తే అందరికి అండగా ఉండి అభివృద్ధి చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆర్మూర్ పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న కార్నర్ సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలోనే గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాలకు సాగునీరు అందించామన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు తీసుకువస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లలో చేసిందేమిలేదన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుకై బీజేపీ నాయకుల మాటల్లో పొంతనలేకుండా పోయిందన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన అమిత్‌షా కూడా పసుపుబోర్డుపై మాట్లాడడం హస్యాస్పదమన్నారు. 21ప్యాకేజీ పనులను త్వరలోనే పూర్తి చేయించి వివిధ ప్రాంతాల్లో సాగునీరు అందిస్తామన్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌లు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేపడతారన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మనం ఓడిపోయిన మన అన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని అభివృద్ధి చేసుకుందమన్నారు. జీవన్ అన్నను ఎంపీగా గెలిపించుకుంటే మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, అన్వేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**వేల్పూర్, మే 8 :** ఇండియా కూటమి అధికారం లోకి రాగానే ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరి స్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచా రంలో భాగంగా వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిలేని కాలంలో ఉపాధి కల్పించేందుకు 20ఏళ్ల క్రితం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సోని యాగాంధీ రూపొందించారన్నారు. కూలీలకు వంద రోజుల పని కల్పించాల్సి ఉందని, రోజుకు రూ.300 కూలీ ఇవ్వాల్సి ఉండగా.. సరిగ్గా రావడంలేదన్నారు. తా ము అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీ లకు రోజువారి కూలీ వేతనం రూ.400చెల్లిస్తా మని, వేసవిలో 35శాతం అదనంగా బోనస్ అంద జేస్తా మన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి రెండు నెలల్లో రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల చొప్పున అందజేస్తామని జీవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేల్పూర్:** ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిలేని కాలంలో ఉపాధి కల్పించేందుకు 20ఏళ్ళ క్రితం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సోనియాగాంధీ రూపొందిం చారన్నారు. కూలీలకు వంద రోజుల పని కల్పించాల్సి ఉందని, రోజుకు రూ.300కూలీ ఇవ్వాల్సి ఉండగా సరిగ్గా రావడంలేదన్నారు. తాము అధికా రంలోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు రోజువారి కూలీ వేతనం రూ.400చెల్లిస్తామని, వేసవిలో 35శాతం అదనంగా బోనస్ అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి రెండు నెలల్లో రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి జీవన్‌రెడ్డి

## పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలి

**● సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలి ● శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశానికి హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, మే 8: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈనెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సెక్టోరియల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోలింగ్ ప్రశాంత వాతావరణలో నిర్వహించే విధంగా చూడాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తోడ్పడాలన్నారు. గతంలో ఇలాంటి బాధ్యతలే నిర్వర్తించామని ఈ ఎన్నికల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి సమాచారాన్ని అందించాలన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందే ఉదయం 6గంటలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకొని సిబ్బంది మొత్తం హాజరయ్యారా అని చూసుకోవాలన్నారు. సామాగ్రిని అన్ని తీసుకున్నారా అని పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను ఎట్టిపరిస్థితుల్లో తెరవకూడదని ఆయన తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 5.30లకే మాక్‌పోలింగ్ నిర్వహించాలన్నారు. ఏజెంట్లు రాని పక్షంలో మరో 15 నిమిషాలు చూసి చేయాలన్నారు. ఈవీఎంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే సెక్టోరియల్ అధికారులు తమ వద్ద రిజర్వులో ఉన్న యూ నిట్లను సమకూర్చాలన్నారు.యూనిట్లు మార్చడానికి ముందు ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందాన్ని సంప్రదించి వారికి సమస్య వివరించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెంట వెంటనే ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.పోలింగ్ ముగిసిన మీదట ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన మౌలిక వసతులను పరిశీలించాలని ఆయన తెలిపారు. ఈసెక్టోరియల్ అధికారుల శిక్షణలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీస్ వజ్, అదనపు కలెక్టర్లు అంకిత్ కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సాకేత్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

**పీఎఫ్‌సీ సెంటర్లలో ఈనెల 10 వరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం: కలెక్టర్**

ఈ ఎన్నికలకు సంబంధించి ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించేందుకు ఈనెల 10 వరకు గడువు పొడగించారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మరో రెండు రోజుల పాటు గడువు ఉన్నందున సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో ఇప్పటి వరకు 5548 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. పార్లమెంట్ పరిధిలో 85 సంవత్సరాలు పైబడిన వారు 1758 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా ఇప్పటి వరకు 1696 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

## ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

మోస్రా,మే8: మండల కేంద్రంలో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిపై హిందువుల మనోభావాలు దెబ్బతినేలా హిందూ దేవుళ్లను, దేవతలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాముని అక్షింతలు, రేషన్ బియ్యం అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రీతం, జగదీష్, సతీష్, అశోక్, సందీప్, మనోహర్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం నిల్వలు

ఖిల్లా, మే 8 : నగరంలోని రెండవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మద్యంను రెండవ టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ. ఎల్.రామ్ తమ సిబ్బందితో పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వర్ని చౌరస్తా సమీపంలో గుల్లకుంట తాండకు చెందిన అంగూరిబాయిను విచారణ చేయగా ఆమె వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.50వేల విలువైన మద్యంను గుర్తించారు. అదే విధంగా సిర్పూర్ తాండకు చెందిన బానవత్ సునీతను తనిఖీ చేయగా ఆమె వద్ద రూ.10వేల విలువైన మద్యంను గుర్తించామన్నారు. మద్యంను స్వాధీంన చేసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్‌కు ప్రశంస



హెడ్ కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 8: ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సాయిశ్యామ్‌ను నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిలు అభినందించారు. లోక్‌అదాలత్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎక్సైజ్ కోర్టు కేసులను త్వరితగతిన పూర్తి చేసిన సాయిశ్యామ్‌కు జిల్లా జడ్జి సునీత కుంచాల చేతుల మీదుగా గత కొన్ని రోజుల క్రితం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని డిప్యూటీ కమీషనర్ కార్యాలయంలో సోమిరెడ్డిని, ఈఎస్ కార్యాలయంలో మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సాయిశ్యామ్‌ను అభినందించారు.

# మూడేళ్లు గడిచినా.. నిర్మించని బ్రిడ్జి

**● భారీ వర్షాలకు కొట్టుకు పోయిన బ్రిడ్జి ● బ్రిడ్జి కూలడంతో రైల్వేప్రయాణికుల ఇక్కట్లు ● పట్టించుకోని సంబంధిత అధికారులు**



మోర్తాడ్‌లో రైల్వేస్టేషన్‌కు వెళ్లేరోడ్డు మధ్యలో కొట్టుకుపోయిన బ్రిడ్జి ఇదే..

మోర్తాడ్, మే8: మోర్తాడ్ జాతీయరహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు గత మూడేళ్లుగా అవస్థలు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి మధ్యలో నిర్మించిన బ్రిడ్జి భారీ వర్షాలకు కొట్టుకు పోయి మూడేళ్ల దాటి పోయింది. అయినా సంబంధిత శాఖాధికారులు స్పందించకపోవడంతో శోచనీయం మొండివాగు ఉధృతికి ఈబ్రిడ్జి కొట్టుకుపోవడం రెండోసారి పరిసర గ్రామాల వారు బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు ఈరహదారి గుండానే వెళ్లారు. అంతేగాక కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ పట్టణాల నుంచి వచ్చే ప్రయాణికులు స్టేషన్ దిగి బస్టాండ్‌కు రావాలన్న అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు నడవక పోవడంతో ప్రయాణికులు కాలినకడన అవస్థలు పడుతు వెళ్లాల్సిందే. రాత్రుళ్లు స్టేషన్‌లో దిగిన వారు రావాలన్నా స్టేసన్‌కు వెళ్లాలన్నా ప్రయాణికులు మొండి వాగులో నుంచి నడిచి వచ్చేందుకు భయపడుతున్నారు. రైల్వే అధికా రులు మొండివాగుపై బ్రిడ్జిని పొడవుగా నిర్మించక పోవడం వల్లనే వర్షాలకు కొట్టుకుపోయిందని గ్రామ స్థులు అంటున్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌కు వెళ్ళాల న్నా స్టేషన్ నుంచి రావాలన్నా విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైల్వేలైన్ ప్రక్క నుంచి చెట్ల మధ్యలో నుంచి కాలినడకన వెళ్తున్నారు. కనీసం మట్టిరోడ్డును కూడా రైల్వే అధికారులు ఏర్పాటు చేయకపోవం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్‌ను కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులు జరుగు తున్నాయని, అంతేగాక రైల్వేఓవర్ బ్రిడ్జి పనులు కోట్ల రూపాయలతో జరుగుతున్నాయని, మోర్తాడ్‌లో కొట్టు కుపోయిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రయాణి కులు ఇబ్బందులు గమనించి రైల్వే శాఖాధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపటాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఈ దారే దిక్కు

**మూడేళ్లుగా రైల్వే ప్రయాణికులు అవస్థలు**



మూడేళ్ల క్రితం కొట్టుకుపోయిన బ్రిడ్జిస్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రయాణికుల అవస్థలు పట్టించుకోకపోవడం శోచనీయం. ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించి ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలి.

\- పెండెం శ్రీనివాస్ ( గ్రామస్థుడు, మోర్తాడ్ )

## 'కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా నిలువు దోపిడీ'



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి వనమల కృష్ణ

డిచ్‌పల్లి,మే8:ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ,ఆర్ ఎస్ఎస్, ఎన్డీఏ, పార్టీలను ఈఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఐ (ఎంఎల్ ) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. బుధవారం డిచ్‌పల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రభుత్వ రంగా సంస్థలను నిర్వర్యం చేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు విక్రయించిదని ఆరోపించారు. అవినీతి రూపుమాపి, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం హామీ నిలుపుకోలేదన్నారు. బీజేపీ చట్ట బద్దంగా అవినీతి ని ప్రోత్సహిస్తు ఎలక్ట్రోల్ బండ్ల పేరిట వేల కోట్ల రూపాయలను సమాకుర్చుకుందన్నారు. బీజేపీ, ఆర్ ఎస్ఎస్ శక్తులు మూడోసారి ఎన్నికల్లో గెలిస్తే దేశంలో కనీస ప్రజాస్వామ్య హక్కులు లేకుండా పోతాయన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు వెంకన్న, సాయాగౌడ్, మురళి, సాయిబాబా, కిషన్, మోహన్, పాల్గొన్నారు.

## మోస్రాలో నిద్రలో నిఘా నేత్రాలు

మోస్రా,మే8: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిద్రలో ఉన్నాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన, దొంగతనాలు జరిగిన నేరస్థులను గుర్తించే నేత్రాలు నిద్రలో ఉంటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ప్రచారం జోరు సందర్భంగా నిఘా లేకుండా ఉంటే అవాంఛనీయ ఘటన జరిగితే.. ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## చికెన్ ధరలు





| రకం | : లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | : రూ.140 | రూ.270 | రూ. 290 |
| వెన్‌కాబ్(కిలో) | : రూ.145 | రూ.275 | రూ. 295 |

## బంగారం ధరలు



| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.71,500 | రూ.66,000 | రూ.845 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
: టిల్లు స్క్వేర్ (4.30)
: బాక్ (10.40)

స్క్రీన్-2 : ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)

స్క్రీన్-3 : ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
: శబరి (7.20)

స్క్రీన్-4 : ప్రసన్నవదనం (1.10, 7.20)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.30)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : బాక్ (10.40)
: ప్రసన్నవదనం (1.40, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.45, 7.40)

స్క్రీన్-3 : బాక్ (1.45, 4.35, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహల్ : వకీల్ సాబ్ (11.15, 2.15, 6.15 9.15)

నటరాజ్ : బాక్ (11.15, 2.15, 6.15 9.15)

విజయ్ : ఆ ఒక్కటి అడక్కు (11.15, 2.15, 6.15, 9.15)



\- నిజామాబాద్ అర్బన్